

18న ఇపిఎఫ్‌ఒ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు మార్చి 18న ఇపిఎఫ్‌ఒ ఆఫీసు ముట్టడి, నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సోమేశ్వరరావు, మోహనరావు పిలుపు ఇచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. కనీస పెన్షన్ రూ.9 వేలు, డిఎతో కలిపి చెల్లించాలని, హయ్యర్ పెన్షన్ అందరికీ ఎటువంటి అభ్యంతరాలు లేకుండా అమలు చేయాలని, ఇపిఎఫ్ 95 పెన్షనర్స్‌కు వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని, సీనియర్ సిటిజన్లకు రైలు ప్రయాణం రాయితీలు కల్పించాలనే డిమాండ్లతో చేపట్టిన ఈ సమావేశంలో ఎస్ఎస్.మూర్తి, ఐ.సుబ్రహ్మణ్యం, బి.పూర్ణిమరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం

- అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అదికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. విద్యార్థులను 8.45కు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటల వరకూ నిర్వహించనున్నారు. పరీక్షా నిర్దేశిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదని ఇప్పటికే విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి హాజరయ్యేలా తల్లిదండ్రులు, విద్యార్థులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలి. అదే విధంగా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.



గోపాలపురంలో అధికారులకు సూచనలు చేస్తున్న పరీక్షలు ఛీఫ్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుందని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గుంపులుగా ఉండేందుకు అవకాశం లేదు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేయాలని అధికారులు ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేటర్లలో స్కూల్ అసిస్టెంట్ల నియామకానికి ప్రాధాన్యమిచ్చారు. సరిపోని పక్షంలో ఎస్‌జిటిలతోపాటు ఇతరుల నియామకాన్ని చేపట్టారు. సబ్జెక్టు టీచర్లను మాత్రం వారి పరీక్ష రోజు రిలీవ్ చేస్తారు. ఈసారి పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్ల నియామకానికి ప్రాధాన్యమిచ్చారు. స్కూల్ అసిస్టెంట్లు సరిపోని పక్షంలో ఎస్‌జిటిలతో పాటు ఇతరుల నియామకాన్ని చేపట్టారు. సబ్జెక్టు టీచర్లను వారి పరీక్ష నిర్వహణ రోజు రిలీవ్ చేస్తారు. పరీక్షలకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 3 వేలకు పైగా ఇన్విజిలేటర్లను నియమించారు.

మెడికల్ కిట్లు సిద్ధం

పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సేవలందేలా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సిబ్బందితోపాటు మందులను వైద్యశాల ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రంలో ఎఎన్ఎంతోపాటు ఆశా వర్కర్‌ను నియమించి ప్రథమ చికిత్సకు అవసరమైన. మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌లుగా ప్రకటించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ప్రత్యేకమైన నిఘా ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్‌ను నిరోధించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. స్క్వాడ్స్ ప్రతిరోజూ ఆయా కేంద్రాలను తనిఖీ చేస్తాయి. పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా బయటి వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరు. వికలాంగులకు అవసరమైతే స్క్రయిబ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

విద్యార్థులకు సూచనలు

పరీక్షలు రాసే విద్యార్థులంతా ఉదయం 8.30 గంటలకల్లా ఖచ్చితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 8.45 నుంచి 8:30 వరకు మాత్రమే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతి స్తారు. తరువాత గేట్లు మూసి వేస్తారు. రోల్ నెంబర్ ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తర్వాత ఇన్విజిలేటర్ బార్ కోడింగ్, ఒఎంఆర్ షీట్, ప్రశ్నపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ ఇస్తారు. తర్వాత ఒఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు పాటించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయకూడదు. ఇన్విజిలేటర్ ఇచ్చిన ఒఎంఆర్ షీట్‌పై విద్యార్థి పేరు, పరీక్షకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ నిర్ధారించుకోవాలి. 10:30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తర్వాత మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసే వరకూ విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. తూర్పు గోదావరి జిల్లాలో 25, 723 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షా కేంద్రాలు 134, ఉన్నాయని అధికారులు తెలిపారు.

గోపాలపురంలో డయేరియా కలకలం

మూడు రోజుల్లో 32 కేసుల నమోదు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలో డయేరియా ప్రబలింది. మూడు రోజుల వ్యవధిలో సుమారు 32 డయేరియా కేసులు గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంకు రాగా పేషెంట్లకు వైద్యం అందించారు. వైద్యం పొందిన వారిలో 25 మంది కోల్కొవడంతో డిశ్చార్జ్ చేయగా ఏడుగురు ప్రస్తుతం వైద్యం పొందుతున్నారని, వీరి ఆరోగ్యం కూడా నిలకడగా ఉందని డిఎం అండ్ హెచ్‌ఒ కె.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. డిప్యూటీ డిఎం హెచ్‌ఒ జె.సంధ్యతో కలిసి గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందుతున్న డయోరియా పేషంట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. పేషంట్లను ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి డాక్టర్లు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి డయేరియా కేసులపై ఆరా తీశారు. డయేరియా కేసు నమోదైన గ్రామాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామాలలో చేయవలసిన సర్వేలు, విధివిధానాలను వారికి వివరించారు. అనంతరం విలేకరులతో డిఎం అండ్ హెచ్‌ఒ మాట్లాడారు. గత కొన్ని రోజులుగా మండలంలో సామాజిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్నదేవరపేట పిహెచ్‌సి, హుకుంపేట పిహెచ్‌సి పరిధిలో సుమారు 30 డయోరియా కేసులు నమోదైనట్లు తెలిపారు. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్టలో 1 కేసు నమోదైనట్లు తెలిపారు. వారందరికీ గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందించినట్లు తెలిపారు. మండలంలో పొగాకు పనులకు వచ్చిన కూలీలకు డయోరియా వచ్చినట్లు తెలిపారు. అందుకు గల కారణాలు తెలుసుకునేందుకు, డయేరియా కేసులు గుర్తించేందుకు 20 ప్రత్యేక మెడికల్ టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎపిడమాలజిస్ట్, ఎపిడెమిక్ టీములు వాటర్, స్టూలు శాంపిల్స్, పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గ్రామాలలో సర్వే లైన్స్ వైద్య సిబ్బంది డయేరియా కేసులపై సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఆర్డబ్ల్యుఎస్, డిపిఒ, ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఏదైనా అనుమానం ఉన్న, వాంతులు, విరేచనాలు లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న డిఎం హెచ్‌ఒ

ప్రభుత్వాసుపత్రిని సదర్శించిన ఆర్‌డిఒ

గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం పొందుతున్న డయేరియా పేషెంట్ల వద్దకు కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత ఆదివారం రాత్రి వచ్చి ఆరోగ్య పరిస్థితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డయేరియా నమోదైన అన్ని గ్రామాల నుండి రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పలు శాఖ అధికారులతో కలిసి సాయిల్ టెస్ట్, వాటర్ టెస్ట్, పొగాకు శాంపిల్స్ కలెక్ట్ చేసి టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డిఒ వెంట తహశీల్దారు అజయ్ బాబు, వ్యవసాయ శాఖ ఎడి చంద్రశేఖర్, ఎఒ రాజారావు, ఆర్‌ఐ హరీష్, డాక్టర్ దేవిశ్రీ పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన జోగి నాయుడు

ప్రజాశక్తి-కడియం

శ్రీ సత్యదేవ నర్సరీని ఆదివారం నటుడు జోగి నాయుడు కుటుంబంతో కలిసి సందర్శించారు. వారికి సత్యదేవ నర్సరీ మేనేజింగ్ డైరెక్టర్ పుల్లా పెద్ద సత్యనారాయణ స్వాగతం పలికారు. నర్సరీలో ఇండోర్ మొక్కల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పెద్దింటి రామబ్రహ్మం, జయశ్రీ, విజయగోపాల్, మెర్ల కృష్ణ పాల్గొన్నారు.



జోగినాయుడుకు స్వాగతం పలుకుతున్న నర్సరీ అధినేత

వైద్య ఖర్చులకు పలువురి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై వైద్యం అందుకుంటున్న కొవ్వూరు నియోజకవర్గం చిడిపి గ్రామానికి చెందిన షేక్ పీర్ సాహెబ్‌కు ఆదివారం పలువురు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని వివిధ సంఘాల రూ.36 వేల ఆర్థిక సాయం అందజేశాయి. మానవత సేవా సంస్థ రూ.12,500, మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు సేకరించిన రూ.7500, ఐడియల్ యూత్ మూమెంట్ యూనిట్ తరుపున రూ.16 వేలు క్షతగాత్రుని కుటుంబానికి అందజేశారు. అంకెం సురేష్, అప్పన హనుమంతు, సనపల రాజశేఖర్ ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పి జి ఆర్ ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా కలెక్టరేట్, డివిజన్, మండల కేంద్రంలో, మున్సిపల్ కార్పొరేషన్ పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రంలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్నాహ్న 1.00 గంట వరకు ప్రజల నుంచి పిజిఆర్ఎస్ అర్జీలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక అధికారులు, జిల్లా, డివిజన్ మండల, మున్సిపల్ క్షేత్ర స్థాయి అధికారులు తప్పనిసరిగా హజరవ్వాలని స్పష్టం చేశారు.

నరసన్న ఆదాయం రూ.23.25 లక్షలు

ప్రజాశక్తి-కోరుకొండ

కోరుకొండ శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి కల్యాణోత్సవాల ఆదాయం రూ.23 లక్షల 25 వేల ఆదాయం వచ్చినట్లు అన్నవరం దేవస్థానం అధికారులు తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే కల్యాణోత్సవాలలో భాగంగా ఈ నెల 10 నుండి ఐదు రోజులపాటు జరిగిన కల్యాణోత్సవాలలో కళ్యాణాలకు రూ.2 లక్షల 10 వేల 924, దర్శనాలకు రూ.2 లక్షల 37 వేలు, లడ్డూ ప్రసాదం రూ.4 లక్షల 6 వేలు, కొబ్బరి, జోళ్ల లైసెన్సులకు రూ.లక్షా 88 వేలు, కట్నాలు రూ,.40 వేల 618, హూండీల ద్వారా రూ.12 లక్షల 441 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ సొమ్ములో హూండీల ద్వారా వచ్చిన రూ.12 లక్షల 41 వేల బ్యాంకులో జమ చేసినట్లు దత్తత దేవాలయమైన అన్నవరం అధికారులు తెలిపారు. అన్నదానం నిమిత్తం రూ.70 వేల 595 వచ్చినట్లు తెలిపారు.

23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పెరవలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 23వ తేదీన 10 గంటలకు నిర్వహిస్తామని ఎంపిపి కె.సీతారామ్ ప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసి పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

ఉష్ణోగ్రతలపై జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి-కడియం

రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని, వడగాల్పుల బారిన పడకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని టిడిపి ఆరోగ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ అన్నారు. కడియం మండలం జేగురుపాడు వంతెన వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత మార్చి నెలలోనే ఎండలు తీవ్రత ఎక్కువగా ఉందని, మంచినీరు, మజ్జిగ, కొబ్బరి బొండాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అనంతరం చలివేంద్రం వద్ద సుమారు వందలీటర్ల మజ్జిగ బాటసారులకు పంపిణీ చేసారు. టిడిపి కార్యకర్త వనమాలి వెంకట బాలాజీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంగతి తెలుసుకుని, జేగురుపాడులోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కడియం గ్రామంలో సాయి వినాయక ఫ్లోర్ మరియు ఆయిల్ మిల్లు నూతన వ్యాపారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ గోరంట్ల రవి కిరణ్

ప్రశాంతంగా ఇగ్నో, బిఇడి, నర్సింగ్ పరీక్షలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) స్టడీ సెంటర్, రాజమహేంద్రవరంలో ఈ రోజు (16 మార్చి 2025) బిఇడి, నర్సింగ్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించారు. ఉదయం బిఇడి ప్రవేశ పరీక్ష, సాయంత్రం నర్సింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇగ్నో, విశాఖపట్నం ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడారు. రాజమహేంద్రవరం కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎంఆర్.గౌతమ్ పరీక్షా ప్రక్రియను పర్యవేక్షించారు. పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరిగేలా చూసారు. స్టడీ సెంటర్ సిబ్బంది శంకర్ రెడ్డి, ముళ్ల లక్ష్మీనారాయణ పరీక్షకు కావాల్సిన అన్ని ఏర్పాట్లూ చేశారు. పరీక్షలు ఇగ్నో నిబంధనల ప్రకారం నిర్వహించారు. అభ్యర్థుల సౌకర్యాన్ని దష్టిలో ఉంచుకుని అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశారు. పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర రావు సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షా కేంద్రంలోని సిబ్బంది క్రమశిక్షణతో, పారదర్శకతతో విధులు నిర్వర్తించినందుకు వారు ప్రశంసించారు.

అశోక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-తాళ్లపూడి

సంపాదనే లక్ష్యంగా కాక అవసరమైన ప్రజలకు ఖరీదైన వైద్య సేవలు ఉచితంగా అందించాలన్న ఆలోచనతో తమ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తాళ్లపూడిలోని అశోక మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ అశోక్ అన్నారు. ఈ ఆసుపత్రి ప్రాంగణంలో యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాల వల్ల ప్రజలకు సేవ చేశామనే సంతృప్తి కలుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ఎముకల సాంద్రత, థైరాయిడ్, సుగర్, బిపి, న్యూరోపతి వంటి విలువైన వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. డాక్టర్ లక్ష్మీ అమూల్య మాట్లాడుతూ ఎముకుల సాంద్రత వంటి పరీక్షలు ఎంతో ఖర్చుతో కూడుకున్నవని, ఇటువంటి పరీక్షలు ఈ ప్రాంతంలో నిర్వహించడం ఇదే మొదటిసారి అని తెలిపారు. డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ సుగర్ వ్యాధి వల్ల కాళ్ల మంటలు వంటి ఇతర అనారోగ్య వ్యాధులు వస్తాయని, వాటి నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు వివరించారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత పరీక్షలతో పాటు అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందులు ఉచితంగా అందజేశారు.



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

మంత్రిపై వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-పెరవలి

మంత్రి దుర్గేష్‌పై వైసిపి నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని జనసేన పార్టీ నాయకుడు పిప్పర రవి కుమార్ అన్నారు. 1950లోనే దుర్గేష్ తాత ఎంఎల్‌ఎగా చేశారని గుర్తు చేశారు. తూర్పు గోదావరి జిల్లాలో 34 సీట్లను కూటమి ప్రభుత్వం గెలుచుకోవడంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షునిగా కీలక పాత్ర పోషించిన దుర్గేష్‌పై వైసిపి అక్కసు వెళ్ళగక్కుతోందని దుయ్యబట్టారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశీస్సులతో పని చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్‌పై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెపుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తులా చినబాబు, నందిప చక్రవర్తి, రేలంగి రాజేష్, సంగీత నాగు, అడ్డగర్ల శక్తిబాబు, చిట్టిడి త్రిమూర్తులు, ఆకుల సుబ్బారాయుడు, పోపోపు శ్రీను, మారిశెట్టి రాంబాబు, పూడి శంకర్, గోపి, కప్పల సునీల్ పాల్గొన్నారు.

అమ్మ వారికి రజత హస్తాల బహూకరణ

ప్రజాశక్తి-కడియం


దుళ్ల గ్రామ శివారు ఏడిద గ్రామంలోని చింతాలమ్మ అమ్మవారికి దుళ్ల గ్రామానికి చెందిన చిట్టూరి వెంకట్రావు, సూర్యచంద్ర ప్రభావతి దంపతులు కేజీ వెండితో రజిత హస్తాలను చేయించారు. వీటిని ఆ దంపతుల తనయుడు చిట్టూరి వెంకన్న చౌదరి, పుష్పవతి దంపతులు ఆదివారం ఆలయ వ్యవస్థాపకులు ఎర్రపోతిన కుటుంబికులు లలితా కృష్ణవేణికి అందజేశారు. దాత వెంకన్నచౌదరి దంపతులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రజత హస్తాల తయారీకి రూ.లక్షా 15 వేలు వ్యయమైనట్లు చిట్టూరి వెంకన్న చౌదరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దూడల నాగేశ్వరరావు, మాజీ ఎంపిటిసి ఈదర నందబ్బు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినిపై తల్లిదండ్రుల ఫిర్యాదు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలని చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని ఎం.లలితాదేవి తమ పిల్లలను దూషించడంతో పాటు కొడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం సాయంత్రం ప్రధానోపాధ్యాయుడు వి.మోహనకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఆమె గతంలో కూడా ఇలాగే విద్యార్థులపై దురుసుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు ఆమెపై విచారణ చేపట్టి మందలించారు. అయినా ఆమె ప్రవర్తలో మార్పు రాలేదని తల్లిదండ్రులు వాపోయారు.

కార్టూ'నిజం'



ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆదివారం పలుచోట్ల ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా రెవిన్యూ అధికారి టి.సీతారామమూర్తి తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం నిరవధిక దీక్ష చేపట్టి, ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన గొప్పవ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన 125వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఘనంగా నివాళులు అర్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి బి.శశాంక, ముత్యాల సుబ్బారావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

గోకవరం మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యండపల్లి శేఖర్ ఆధ్వర్యారన బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గోకవరపు మాణిక్యం, అప్పన చంద్ర ధరగుప్త, కంకిపాటి శివ, అప్పన జగదీష్, కడలి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

ఉండ్రాజవరం ఉండ్రాజవరం, పాలంగి గ్రామాలలో శ్రీరాములు విగ్రహాలకు పూలదండలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రాజేష్ మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కొరకు చేసిన ఆమరణ నిరాహారదీక్షతో తృణప్రాయంగా, ప్రాణాలర్పించి, అమరజీవిగా ఆంధ్రుల హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరచుకున్న మహా పురుషుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొర్లేపర పుల్లేశ్వరరావు, సింహాద్రి వీర వెంకట సత్య నారాయణ గుప్త, పచ్చిపులుసు పుల్లేశ్వరరావు, తటవర్తి సత్యనారాయణ, నాగవరపు సత్యనారాయణ, నూలు సుబ్బారావు, కోట్ల కాశి, గమని కుమార్, ముత్తా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అసలే ఆక్రమణ.. ఆపై అద్దెకు..?

ప్రజాశక్తి-కడియం

మండల కేంద్రమైన కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన గేటును ఆనుకుని కంటైనర్‌లో ఇటీవల కాలంలో 'హితాచి ఎటిఎం' ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కంటైనర్‌లో ఈ ఎటిఎం ఏర్పాటు చేయడం అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. హైస్కూల్ ప్రహరీ చెంతన ఉన్న పంచాయతీ డ్రైనేజీని ఆక్రమించి, ఆపై డ్రైన్‌పై అక్రమంగా రేకుల బడ్డీనిర్మించి ఎటిఎంకు లీజుకు ఇచ్చాడు గ్రామానికి చెందిన ఒక ప్రబుద్ధుడు. ఇటీవలే పంచాయతీ అధికారులు ఇదే ప్రాంతంలో డ్రైనేజీపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. కానీ ఎటిఎం విషయంలో అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పలువురు పంచాయతీ తీరును తప్పుబడుతున్నారు. కనీసం భద్రతా ప్రమాణాలు పాటించకుండా కంటైనర్‌లో ఎటిఎం ఏర్పాటు చేయడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పొరపాటున విద్యుదాఘాతం సంభవిస్తే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ డ్రైనేజీని ఆక్రమించడమే కాక భద్రతా సౌకర్యం లేని ఎటిఎంకు ఎలా అనుమతి ఇచ్చారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కంటైనర్‌లో ఎటిఎం పెట్టడానికి అనుమతులు ఎవరు ఇచ్చారు. ఎలా ఇచ్చారని పలువురు చర్చించుకుంటున్నారు.



కడియం హైస్కూల్ గేటు చెంతన ఏర్పాటు చేసిన ఎటిఎం

నేరాలు ఘోరాలు

కన్నతల్లిని కడతేర్చిన కుమారుడు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

అర్థరాత్రి వరకు బయట తిరగడం, ఇంటి పట్టున ఖాళీగా ఉంటూ చెడు తిరుగుళ్లు తిరగడం ఎందుకు.. ఖాళీగా ఉండకుండా ఏదో చిన్న పనో, ఉద్యోగం చేసుకోమన్న కన్నతల్లిపై ముఖంపై పిడి గుద్దులు కురిపించడంతో ఆ మాతృమూర్తి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దారుణ ఘటన ఆదివారం ఎస్.అచ్చుతాపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే కాకినాడ 48వ డివిజన్ ఎస్.అచ్చుతాపురం పెంతెకోస్తు చర్చి వెనకాల శ్రీ సాయి నిలయం అపార్టుమెంట్‌కు చెందిన షేక్ జహరా బీబీ (48) కరణంగారి సెంట ర్‌లో ఇడ్లీ పిండి అమ్ముతుంది. భర్త ఖాదర్ భాష, మరో కుమారుడు పెయిం ట్ పనిలోకి వెళ్తుంటారు. ఇందులో పెద్ద కుమారుడు షేక్ షబీర్ కమల్ బీటెక్ మధ్యలో ఆపేసి ఏపనీ చేయకుండా అర్థరాత్రి వరకు రోడ్లపై తిరుగుతుంటాడు. మద్యం తాగడం, డబ్బుల కోసం తల్లిని వేధిస్తూంటాడు. ఖాళీగా ఉండే బదులు ఏదో పని చేసుకోవాలని తల్లిదండ్రులు రోజు కుమారుడు షబీర్ కమల్‌ను సూచిస్తూంటారు. ఆదివారం మధ్యాహ్నం తల్లి ఇంటి వద్ద ఉండగా కుమారుడు షేక్ షబీర్ వచ్చి తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బులు ఇచ్చేందుకు ఆమె నిరాకరించింది. పని చూసుకోమన్నందుకు కోపోద్రోకానికి గురై వెంటనే తల్లి ముఖంపై పిడి గుద్దులు కురిపించడంతోపాటు, కుక్కర్ మూతతో తలపై కొట్టడంతో కుప్పకూలిపోయింది. తలపై తీవ్రగాయం కావడంతో ఆమె ప్రాణాలు కోల్పోయింది. మతుడు అక్కడ నుంచి బయటకు వెళ్లిపోయాడు. మతురాలి భర్త ఫిర్యాదు మేరకు సిఐ డిఎస్.చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఐ.వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడలిపై అత్త దాడి .. కేసు నమోదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని కందులపాలెం గ్రామంలో బొడ్డు ఉమామహేశ్వరి అనే మహిళపై ఆమె అత్త సత్యవతి దాడి చేసి గాయపరిచిందని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవి.. కందుల పాలెం గ్రామ చెందిన ఉమామహేశ్వరి తన భర్త కనిపించడం లేదని అత్తను నిలదీసింది. దీంతో అత్త దాడి చేసిందని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోడలు ఉమామహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమో దు చేసి ఏఎస్ఐ భుజంగరావు దర్యాప్తు చేస్తున్నారు.

కోడలిపై అత్త ఫిర్యాదు

కాకినాడ నుంచి వచ్చిన తన కోడలు మహేశ్వరి మరో ఆరుగురిని తీసుకువచ్చి తనపై దాడి చేసిందని అత్త సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సత్యవతి ఫిర్యాదు పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

నగదు అపహరణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలంలోని పేకేరు గ్రామానికి చెందిన బత్తుల ప్రసన్నకుమార్ సైబర్ క్రైమ్ లో తాను రూ.2.50 లక్షల నగదు పోగొట్టుకున్నట్లు కె.గంగవరం పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తన పేరుపై ఇన్సూరెన్స్ క్లెయిమ్ ఉందని నమ్మించి క్రెడిట్ కార్డుతో ఫొటో పంపించాలని కోరాడన్నారు. దీనికి సంబంధించిన వివరాలు పంపించగా రెండు దఫాలుగా తన అకౌంట్ నుండి రూ.2,50 లక్షల నగదు అపహరించినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక బోడుపాలెం వంతెన వద్ద రోడ్డు పక్కనే పడుకున్న వ్యక్తిని ట్రావెల్ బస్సు ఎక్కడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఎస్ఐ సురేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం.. కొత్తపేట గ్రామం సమితి రోడ్డు వీధికి చెందిన కోనాల రాఘవులు(72)కి కుమార్తె, కుమారుడు ఉన్నారు కుమారుడు వృత్తిరీత్యా లారీ క్లీనర్. కుమార్తెకు వివాహం కావడంతో అత్తవారింటికి వెళ్లిపోవడంతో రాఘవలకు చూసే నాథుడు లేక బోడిపాలెం ఆంజనేయ స్వామి గుడి సమీపంలో తిరుగుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి అమలాపురం వైపు నుంచి వస్తున్న ఒక ప్రయివేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ వేగంగా నడుపుతూ రోడ్డు పక్కన పడుకున్న రాఘవులపై ఎక్కించాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే చనిపోయాడు. ఈ ఘటనపై కుమార్తెఉండవల్లి వెంకటరమణ ఫిర్యాదుమేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

కోడిగుడ్ల లోడ్ కంటైనర్ బోల్తా

ప్రజాశక్తి-గోపాలపురం

తెలంగాణ నుంచి భువనేశ్వర్‌కు కోడిగుడ్ల లోడుతో వెళుతున్న కంటైనర్ గోపాలపురం హైవే రోడ్డులో ఆదివారం అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనరు చిన్నపాటి గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు స్థానికుల సాయంతో కంటైనర్‌ను మిషనరీ ద్వారా లారీను తొలగించారు.

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని వజ్రకూటం సెంటర్ మీదుగా పశుమాంసాన్ని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం తెల్లవారాజుజామున పాత వజ్రకూటం గ్రామ శివారు కొండ ప్రాంతంలో పశు వులను చంపి మాంసాన్ని హైవే ప్రాంతాల్లో ఉన్నా హోటల్స్‌కు సరఫరా చేసేందుకు తరలిస్తుండగా పోలీసులు తనిఖీల్లో పట్టుకున్నారు. మాంసాన్ని రవాణా చేస్తున్న చెందుర్తి గ్రామానికి చెందిన మిరియాల రమేష్, ఆరుగుల తాతయ్య, గండేటి రఘులపైకేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

కోడిపందేలపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని మన్యంవారిపాలెం గ్రామ శివారున నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్ఐ రఘునాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద రెండు పుంజులు, రెండు కత్తులు, రూ.1020 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'పది' పరీక్షలకు 100 రోజుల ప్రణాళిక

'ప్రజాశక్తి'తో పాఠశాల విద్య ఆర్‌జెడి నాగమణి





ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ మరింత పెంచేందుకు కృషి చేస్తున్నామని, పిల్లలను సరైన మార్గంలో పయనింపజేసేందుకు పక్కా ప్రణాళికతో విద్యా వ్యవస్థలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకొచ్చిందని పాఠశాల విద్య రీజనల్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా 100 రోజుల ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో పలు అంశాలను వెల్లడించారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరు?

జిల్లాలోని 21 మండలాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, జడ్‌పి హెచ్ఎస్, కెజిబివి, సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఎపి రెసిడెన్షియల్ పాఠశాలల్లో 18,300 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారిలో బాలురు 8,700 మంది బాలికలు 9,600 ఉండగా బాలురకంటే బాలికలు ఎక్కువ శాతం ఉన్నారు. విద్యార్థి భవిష్యత్తుకు 10వ తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైన కేంద్రాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తాం. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణను అందిస్తున్నాం. ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి పరీక్షలకు సన్నద్ధం చేశాం. ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సంఖ్య పెంచుతాం. పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహిస్తాం. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం.

యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారా.?

సమ్మెటివ్ పరీక్షల అనంతరం విద్యార్థులను, పాఠశాలలను, మండలాలను గ్రేడులుగా విభజించాము. ఉదయం 9 గంటల నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాం. సబ్జెక్టులు, మండలాల వారీగా సమీక్షలు, తల్లిదండ్రులు సమావేశాలు నిర్వహించాము. డిసెంబరు 1న ప్రారంభించిన ఈ ప్రణాళికను మార్చి 10 వరకూ అమలుచేశాం. విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత, అధికమార్కులు సాధించేలా ఈ ప్రణాళికను ఈనెల 1 నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేశాం. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు స్టేట్ సిలబస్ ఆధారంగానే విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. గతంలో డిసిఇబి ద్వారా ప్రణాళిక రూపొందించి ఇచ్చేవారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలోనే తయారు చేసిన పరీక్ష ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందించనున్నాం.

విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేశారు.?

పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించే విధంగా విద్యాశాఖ 100 రోజుల ప్రణాళికను అమలు చేసాం. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ 6 పీరియడ్లు, స్టడీ అవర్స్ నిర్వహించాం. స్టడీ అవర్సో పాల్గొనే ఉపాధ్యాయులకు ప్రత్యేక సిసిఎల్ మంజూరు చేసాం. ప్రతిరోజూ సబ్జెక్ట్ నిపుణులు తయారు చేసిన ప్రశ్నాపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని సంబంధిత విద్యార్థులతో పరీక్ష రాయించాం.

వంతెనలకు మరమ్మతులు ఎప్పుడో..!

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి



శిథిలావస్థలో ఉన్న నేమాం వంతెనకు రైలింగ్

గత ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురియైన బీచ్ రోడ్‌పై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. పెద్దపెద్ద గుంతలతో ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టింది. అయితే శిథిలావస్థలో ఉన్న వంతెనలను మాత్రం పట్టించుకోకపోవడంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన ప్రయాణి కులను వెంటాడుతోంది. ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అద్దరపేట, కాకినాడకు మధ్య రోజు వారీగా వందలాది మంది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బీచ్ రోడ్డులో ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారు. అయితే ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీల భాగంగా బీచ్ రోడ్డులో గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే అదిరిపేట నుంచి కాకినాడ వరకు సుమారు 10కి పైబడి వంతెనలు ఉన్నాయి. ఈ వంతెనలు శిధిలావస్థకు చేరుకున్నాయి. ఆఖరికి వంతెనలకు ఇరువైపులా ఉండే రక్షణ గోడలు సైతం కూలిపోయాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు భయభ్రాం తులకు గురవుతున్నారు. నేమం సమీపంలో ఉన్న వంతెన, శీలవారిపాలెం సమీపంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకున్నాయి. నెలలు గడుస్తున్న వంతెనలకు మరమ్మతులు చేపట్టడం లేదు. ప్రమాదాల నివారణకు అవసరమైన కనీసం హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేయని పరిస్థితి నెలకుంది. ఈ వంతెనలు అతి చిన్నగా ఉండడం, ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించుకునే సందర్భాల్లో వంతెనలకు ఇరువైపులా గోడలు లేకపోవడంతో ఉప్పు టేరులో పడిపోతామనే ఆందోళన వహన దారుల నుంచి విన్పిస్తుంది. ప్రమాదాలు చోటు చేసుకున్న తర్వాత అధికారులు హడావుడి చేసేకంటే ప్రమాదాలు జరగక ముందే వంతెనలకు మరమ్మతులు చేపడితే మంచిదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న వంతెనలను మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వ్యర్థాలతో నిండిపోతున్న డ్రెయిన్

ప్రజాశక్తి - పెద్దాపురం



స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న పెద్ద డ్రెయిన్ వ్యర్థాలతో నిండిపోతుంది. నీటి ప్రవాహం లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ డ్రెయిన్‌లో పూడికను తీయడంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి మురుగునీరు ఈ డ్రెయిన్ ద్వారానే బయటకు వెళ్తుంది. ఈ డ్రెయిన్‌ను రోజుల తరబడి పరిశుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల ఈగలు, దోమలు పెరిగిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయిన్‌లో పూడికను తొలగించేందుక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిఎంజె జ్యువెల్స్ నూతన స్టోర్ ప్రారంభం..

ప్రజాశక్తి - కాకినాడ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు

దక్షిణ భారతదేశంలో ఫైన్ జ్యువెల్లరీ బ్రాండ్‌గా గుర్తింపు పొందని పిఎంజె జ్యువెల్స్ కాకినాడలోకొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ఆదివారం ఎంఎల్ఎ వనమడి వెంకటేశ్వరరావు, ఆంధ్రా బిజినెస్ హెడ్ హైదర్ అలీ, పిఎంజె జ్యువెల్స్ క్లస్టర్ మేనేజర్ షేక్ గాలి షరీఫ్, కాకినాడ స్టోర్ హెడ్ పెద్దోజు శేషగిరి నూతన స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వినియోగ దారులతో షోరూమ్ కిటకిటలాడింది. కాకినాడ కస్టమర్ల విభిన్న అభిరుచులను, ఆభరణాల సాంగిత్యాన్ని తీర్చడానికి స్టోర్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రా బిజినెస్ హెడ్ హైదర్ అలీ అన్నారు. తమ షోరూమ్‌లో వజ్రాలు, బంగారం విలువైన స్టోన్స్‌తో సహా విస్తృత శ్రేణి డిజైన్‌లను అందిస్తుందని తెలిపారు. పిఎంజె యొక్క అత్యుత్తమమైన, ఇంతకు ముందు చూడని డిజైనర్ ఆభరణాలు, హస్తకళ సృజనాత్మక ఆభరణాలు, వివాహ ఆభరణాలతో పాటు అన్ని వేడుకలకు అనువైన తేలికైన వస్తువులు ఈ సేకరణలో ప్రదర్శించబడతాయని కాకినాడ స్టోర్ హెడ్ పెద్దోజు శేషగిరి అన్నారు. ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పిఎంజె జ్యువెల్స్‌ను కాకినాడకు విస్తరించడం ఆనందంగా ఉంది. ఆభరణా లను నాణ్యత, హస్తకళ పట్ల వారి నిబద్ధత ప్రశంసనీయమని, ఈ కొత్త స్టోర్ కాకినాడతో పాటు చుట్టుపక్కల ప్రజలకు ఆభరణాల షాపింగ్ అనుభవాన్ని మరింత పెంచుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

పిల్లల చదువుపై కలతతోనే..

-పిల్లల్ని చంపి ఆపై తండ్రి ఆత్మహత్య
-సైకలాజికల్ డిజార్డర్‌తోనే హత్యలు
-నిర్ధారించిన పోలీసులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

'భవిష్యత్తులో పోటీ ప్రపంచానికి తగ్గట్లు చదవలేకపోతున్నారు. సరిగా చదవక పోతే జీవితంలో మంచిగా స్థిరపడలేరు. తద్వారా కొన్ని కష్టాలు పడాల్సి వస్తుంది. వీరు పడేటటువంటి కష్టాలను తండ్రిగా నేను చూడలేను.. నా భార్య మంచిది ఐ విష్ హెర్.. అందుచేతే ఇద్దరి పిల్లల్ని చంపేసి తానూ కూడా ఆత్మహత్యకు పాల్పడినట్లు మతుడు వానపల్లి చంద్రకిషోర్ తన సూసైడ్ నోట్లో రాసినట్లు ఎఎస్‌పి మనీస్ దేవరాజ్ పాటిల్ తెలిపారు. ఆదివారం కాకినాడ జిల్లా సర్పవరం పోలీస్ స్టేషన్లో చిన్నారుల హత్యోదంతంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. పిల్లల చదువుపై కలతతోనే చిన్నారులు వానపల్లి జోషిల్, నిఖిల్లను కాళ్లు, చేతులకు తాళ్లు కట్టి, కళ్లకు గంతలు కట్టిబాత్రూమ్లోకి తీసుకెళ్లి బకెట్లలలో నీటిలో ముంచడంతో ఊపిరాడకుండా చేసి ఇద్దర్ని తండ్రి చంపేసి, ఆతర్వాత ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. నేరస్థలంలో లభించిన సూసైడ్ నోట్‌ను అన్ని కోణాల్లో పరిశీలించగా ఆ సమయంలో అతని మానసిక స్థితి సరిగా లేకపోవడంతో సైకలాజికల్ డిజార్డర్తో బాధపుతున్నట్లు తెలుస్తుందన్నారు. అతని స్వదస్తూరీతోనే మరణ వాంగ్మూలం రాసినట్లు నిర్ధారించామన్నారు. చిన్నారుల హత్య సంఘటన ఎస్‌పితో సహా అందర్నీ తీవ్రంగా కలచి వేసిందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులకు ఈ ఘటనే ఉదాహరణగా చేస్తూ అప్పీలు చేస్తున్నామన్నారు. చిన్నతనంలోనే పిల్లలపై చదువు పేరుతో ఒత్తిడికి గురి చేయరాదన్నారు. 5 నుంచి 10 ఏళ్ల బాల్య దశలో చదువు పేరుతో ఒత్తిడి చేసి, మార్కుల కోసం వారి తెలివితేటలపై అంచనాకు రావడం మంచిది కాదన్నారు. ఇంటర్లో మార్కులు తక్కువ వచ్చిన విద్యార్థులకు ఎంసెట్ తదితర ఉన్నత విద్యాభ్యాసంలో మంచి మార్కులు, ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. పిల్లల తెలివితేటలు, ఐ క్యూ వారి తల్లిదండ్రుల తెలివితేటలు, చుట్టు పక్కల పరిసరాలు, స్కూల్, వాళ్లు పెరిగే వాతావరణంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఎల్‌కెజీ, యూకెజిలోనే పిల్లలు సరిగా చదవడం లేదు అని అంచనాకు వచ్చి వారి బాల్యాన్ని ఒత్తిడిలోకి నెట్టేసే హక్కు ఎవరికీ లేదన్నారు. బాల్యదశలో చిన్నారుల మానసిక స్థితి పెరిగేలా, చక్కని వాతావ రణం కల్పించాల్సిన బాధ్యత సమాజంలో ఉన్నప్రతి ఒక్క తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ పిల్లల హత్య కేసును అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేసిన అనంతరం తండ్రే ఇద్దరి పిల్లల్ని హత్య చేసి అతనూ ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన తెలిపారు.

పిన్న వయసులోనే జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పిఠాపురం



జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన బాలిక

మండలంలోని ఎఫ్‌కె.పాలెం గ్రామానికి చెందిన ముమ్మిడి నిత్యశ్రీ పిన్న వయసులోనే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయింది. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ ప్రకటించిన జాబితాలో నిత్యశ్రీ స్థానం దక్కించుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అండర్ 10 ఇండియన్ రౌండ్ బాలికల విభాగంలో ఆరేళ్ల వయసులో తొలిసారిగా జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయినట్టు కోచ్ లక్ష్మణరావు తెలిపారు. ఈనెల 22 నుంచి 29 వరకు గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరగబోయే జాతీయ స్థాయి అండర్ 10 ఇండియన్ రౌండ్ బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనుంది. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె పద్మనాభం, కుటుంబ సభ్యులు, స్థానికులు బాలికను అభినందించారు.

అంధ విద్యార్థినికి అండగా ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - కోటనందూరు



బోధనపరికరాన్ని అందిస్తున్న కొండబాబు

అంధ విద్యార్థినికి బిళ్ళనందూరు ఎంపియుపి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దాడి కొండబాబు అండగా ఉండేందుకు ముందుకొచ్చారు. అదే స్కూల్లో 8వ తరగతి చదువుతున్న కె.వెంకటకుసుమాదేవికి రెండు కళ్ళు కనిపించవు. ఆ విద్యార్థిని యొక్క పరిస్థితిని చూసి మానవతా దృక్పథంతో విద్యార్థికి చదువుకు అవసరమైన అన్నీ తానే భరిస్తానని, ఉద్యోగం సంపాదించే వరకు బాధ్యత వహిస్తానని అన్నారు. అంధ విద్యార్థులు విద్య నేర్చుకోవడానికి అవసరమైన పరికరాలను విద్యార్థినికి అందజేశారు. బ్రెయిలీ లిపి విధానంలోనే ఆమెకు ఆయన బోధిస్తున్నారు. అంధ విద్యార్థినికి తోడుగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు కొండబాబును ఎంఇఒలు శ్రీనివాసరావు, రామశేఖర్ అభినందించారు.

నేడు పాడా కార్యాలయంలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక పాత బస్టాండ్ వద్ద గల పాడా కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పాడా పీడీ చైత్రవర్షిణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఉదయం 10:00 గంటల నుంచి 1:00గంట వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. స్థానిక వివిధ శాఖల అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆమె ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.



మున్సిపల్ కార్యాలయం ఎదురుగా విద్యుత్ స్తంభాన్ని అల్లుకుపోయిన మొక్కల తీగలు

అల్లుకుపోతున్న నిర్లక్ష్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, అన్న క్యాంటీన్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని లతలు అల్లుకుపోయాయి. నిత్యం ఈ ప్రాంతంలో ఆటోలు, వాహనాలు ఎక్కేందుకు ప్రయాణికులు వేచి ఉంటారు. ఈ స్తంభం చుట్టూ పెరిగిపోయిన పిచ్చి మొక్కలు విద్యుత్ స్తంభాన్ని చుట్టుకుని విద్యుత్తు తీగలను అల్లుకుపోయాయి. ఈ అల్లుకుపోయిన తీగలు విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకితే మొక్కలు గుండా విద్యుత్ ప్రవహిస్తుందని, ఈ మొక్కలను పశువులు, పక్షులే కాకుండా మనుషులు తాకినా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకుందని ఆందోళన వ్యక్తం అవుతోంది. తక్షణమే సంబంధిత శాఖ అధికారులు స్పందించి అల్లుకుపోయిన లతలన తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖండవిల్లి భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సాంబమూర్తి నగర్ లోని ప్రభుత్వ అందుల ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవనం శిథిలమై పెచ్చులు ఊడటంతో అంధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖకు శాశ్వత అసిస్టెంట్ డైరెక్టర్‌ను నియమించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. సమస్యపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన పార్టీకి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



నాగబాబుకు చెక్కును అందిస్తున్న వీర్రాఘవులు

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మండలంలో లంపకలోవ గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు పంది వీర్రాఘవులు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శికొణిదెల నాగ బాబుకు రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ స్థాపించినప్పటి నుంచి పార్టీకి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. తన కుమారుడు ఎన్ఆర్ఐ పంది సునీల్ జనసేన పార్టీ మీద అభిమానంతోనే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పోస్టల్ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కాకినాడ

భారతీయ పోస్టల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం కాకినాడ గ్రూప్-సి సమావేశం స్థానిక కాస్మోపోలిటిన్ క్లబ్‌లో జరిగింది. ఈ సమావేశంలో బిఎంఎస్ ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఎం.జగదీశ్వరరావు, గ్రూప్ సి సర్కిల్ కార్యదర్శి వెంకయ్య పాల్గొన్నారు. ఈ సమావేశంలో విశాఖపట్నం రీజనల్ గ్రూప్ సి డివిజనల్ రిప్రజెంటేటివ్‌గా కె.సత్తిబాబు, సూపర్‌వైజర్ అసోసియేషన్ రీజనల్ రిప్రజెంటేటివ్‌గా పిఆర్.వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. అలాగే కాకినాడ గ్రూప్ సి ప్రెసిడెంట్‌గా టి.జగదీష్, కార్యదర్శిగా బి.అప్పారావు, కోశాధికారిగా ఒ.సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సిహెచ్.వెంకటేష్, కాళీమాత, కె.బ్రహ్మానందరెడ్డి, పిఆర్వి.రావు, కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఆలయానికి వచ్చే యాత్రికుల కోసం దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నదాన కార్యక్రమంలో దాత కెప్టెన్ రవి అరటి పళ్ళు అందజేశారు. ప్రతి వారం అరటి పండ్లు వితరణ చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ ఆశాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, ఆలయ పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, వేద పండితులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి గ్రామంలో ఏలేరు వంతెన ఇరువైపులా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎస్ఐ మౌనిక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులపై ప్రజల నుంచి ఫిర్యాదులపై ఆదివారం ఆమె పోలీసు సిబ్బందితో కలిసి ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. ఏలేరు బ్రిడ్జికి ఇరువైపుల మాంసం, చేపలు, ఇతర దుకాణాలకు సంబంధించి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడే దుకాణదారులను గుర్తించి వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఆమె దగ్గర ఉండి ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా దుకాణాలు ఏర్పాటుకు సూచించారు.

రైలింగ్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కాజులూరు



ప్రమాదకరంగా ఉన్న రైలింగ్

మండలంలోని ఉప్పుమిల్లి శివారు టేకి డ్రైన్‌పై గల వంతెనకు రైలింగ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. గత నెలలో యానాం నుంచి ద్రాక్షారామ వెళ్లే లారీ రైలింగ్‌ని ఢీకొని డ్రెయిన్‌లో పడిపోయింది. నిత్యం వందలాది వాహనాలు తిరిగి ఈ ప్రధాన రహదారిలో వంతెనకు రైలింగ్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లారీ ఢీకొనడంతో సగం వరకు వంతెన రైలింగ్ శిథిలమైంది. వెంటనే అధికారులు స్పందించి రైలింగ్ ను పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.


ఘనంగా తొలిగరగల ఉత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలం కాండ్రకోటలో 40 రోజులపాటు జరిగే నూకాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆదివారం తొలి గరగల ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య ఆధ్వర్యంలో డప్పుల దరువుల మధ్య గరగల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు, యాత్రికులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలిశెట్టి నాని, చక్ర ప్రకాష్, లొల్ల అన్నవరం. గవరసాన శివరామకృష్ణ, మార్నీడి అప్పారావు, వరహాలు, సావిటి నాగేశ్వరరావు, కర్ణాటక రామకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఐ లవ్ సామర్లకోట బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి - సామర్లకోట



స్థానిక రైల్వే స్టేషన్ రింగ్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన గడియారం స్తంభం వద్ద ఐ లవ్ సామర్లకోట ప్రత్యేక బోర్డుని ఆదివారం ఏర్పాటు చేశారు. అయితే అధికారికంగా గడియార స్తంభం ప్రారంభం కావలసి ఉంది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో మొదలైన గడియారం రింగ్ రోడ్డు సెంటర్ పనులు వైసిపి ప్రభుత్వ పాలనలో మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఆధునీకరణ పనులు ప్రారంభించి పనులు పూర్తి చేశారు. తాజాగా ఐ లవ్ నేమ్ బోర్డ్ ఏర్పాటుతో రింగ్ సెంటర్ ఆకర్షణీయంగా మారింది.